

బీచ్‌లో స్నానానికి దిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో స్నానాలు చేస్తూ ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాదుకు చెందిన వడ్డిపత్తి రాజేష్ (20) సోదరి వివాహం ఈనెల 7న పెద్ద కాపవరంలోని గొల్లగూడెంలో జరిపేందుకు ఏర్పాటు చేసుకున్నారు. వివాహానికి హైదరాబాద్, విశాఖపట్నం నుండి పలువురు మిత్రులు వచ్చారు. 9 మంది స్నేహితులతో కలిసి రాజేష్ పేరుపాలెం బీచ్‌కు వచ్చాడు. అక్కడ స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తూ అలల ఉధృతికి రాజేష్, బండారు వినయ్ (19)లు ఇరువురు మునిగారు. ఆ ప్రాంతంలోని వారు ఒడ్డు తీసుకొచ్చి 108కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అత్యవసర వాహన సిబ్బంది వారికి పరీక్షల నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నిర్వాసితుల సమస్యలపై మమ..!

సిఎం 'పోలవరం' సమీక్షా సమావేశమంతా ప్రాజెక్టు పనులపైనే
సర్వం కోల్పోయిన నిర్వాసితుల గోడు పట్టని పరిస్థితి
పరిహారం చెల్లింపుపై స్పష్టత కరువు
మూడు గంటల పాటు సాగిన సిఎం పర్యటన
మీడియాపై తీవ్ర ఆంక్షలు



స్పిల్ వ్యూ నుంచి ప్రాజెక్టును పరిశీలిస్తున్న జగన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఇచ్చిన ప్రాధాన్యత.. సర్వం కోల్పోయి తమ బతుకులను త్యాగం చేస్తున్న నిర్వాసితుల పట్ల లేని పరిస్థితి నెలకొంది. మంగళవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్వాసితుల సమస్యలపై సరైన స్పష్టత ఇవ్వకపోవడం అందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ముందు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించిన సిఎం ఉదయం 10.05 గంటలకు పోలవరం హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఎంకు మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. దాదాపు మూడుగంటల పాటు ఆయన పర్యటన సాగింది. తొలుత వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్టును సిఎం పరిశీలించారు. అనంతరం రోడ్డుమార్గాన వెళ్లి ఎగువ, దిగువ కాఫర్‌డ్యాం, దెబ్బతిన్న డయాఫ్రం వాల్ పనుల తీరును పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన మ్యాప్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనుల పరిశీలన తర్వాత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనేక అంశాలను చర్చించారు. గైడ్‌వాల్ సమస్యపైన, దెబ్బతిన్న డయాఫ్రంవాల్ పనులపైన, స్పిల్‌వే, అప్రోచ్ పనులు, ఇసిఆర్‌ఎఫ్ దెబ్బతిన్న గ్యాప్ పనులు వంటి అనేక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. నిర్వాసితుల సమస్యలపై మాత్రం చర్చ తూతూమంత్రంగా సాగినట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం నిర్వాసితులను తరలించాలని, పునరావాస కాలనీల్లో సామాజిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్న అంశాలకే పరిమితమైన పరిస్థితి నెలకొంది. గత ఏడాది జులై, ఆగస్టులో విరుచుకుపడిన వరదలకు నిర్వాసితుల పరిస్థితి దయనీయంగా మారింది. నెలల తరబడి పునరావాస కాలనీల్లోనే తలదాచుకున్నారు. ఇల్లుకట్టుకోలేక ఇప్పటికీ కొన్ని కుటుంబాలు పునరావాస కాలనీల్లోనే నివాసం ఉంటున్నారు. మళ్లీ జులై వచ్చేస్తోంది. వరదలు విరుచుకుపడే ప్రమాదం ఉంది. 41.15 కాంటూరు పరిధిలోని నిర్వాసిత కుటుంబాలకు 2022 సెప్టెంబర్ నాటికి పరిహారం అందిస్తామని అప్పట్లో సిఎం ప్రకటించారు. ఇప్పటికీ 30 శాతం మందికి కూడా పరిహారం అందలేదు. మిగిలిన కుటుంబాలకు పరిహారం ఎప్పట్లోగా పరిహారం అందిస్తారో సిఎం జరిపిన సమీక్షా సమావేశంలో స్పష్టత ఇవ్వలేదు. పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షల పెంపు, 2006కు ముందు సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల పరిహారం ఇస్తామని ఇచ్చిన హామీల గురించి మాట్లాడిన పరిస్థితి లేదు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, భూమికి భూమి వంటి అనేక సమస్యలు అలానే ఉన్నాయి. ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తిచేయాలంటూ ఆదేశాలు ఇవ్వడం తప్ప నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారంపై మాత్రం కనీస చర్చకూడా లేదు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిమిత్తం రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపినట్లు సమీక్షా సమావేశంలో అధికారులు సిఎంకు తెలిపారు. ఈ సొమ్మును నిర్వాసితుల సమస్యలకు ఉపయోగిస్తారా లేక నిర్వాసితులను గాలికొదిలేసి నిర్మాణ పనులకు మళ్లిస్తారా తెలియని పరిస్థితి నెలకొంది. సిఎం పర్యటనలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనా రాయణ, మంత్రులు అంబటి రాంబాబు, తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎంపీ కోటగిరి శ్రీధర్, జి.మాధవీ, మార్గాని భరత్, శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, జయమంగళ వెంకట రమణ, షేక్ సాబ్జీ, వి.చిరంజీవి, అనంత ఉదయ భాస్కర్, శాసన సభ్యులు తెల్లం బాలరాజు, ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్, ఎంవి.ప్రతాప్ అప్పారావు, ఉన్నమట్ల ఎలిజా, కె.అబ్బయ్య చౌదరి, పుప్పాల వాసుబాబు, దూలం నాగేశ్వరరావు, తలారి వెంకట్రావు, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, స్థానిక ప్రజాప్రతినిధులు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మీడియాపై ఆంక్షల కత్తి

గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ లేని విధంగా సిఎం పర్యటనల్లో జిల్లా అధికారులు తీవ్ర నిర్బంధాలు ప్రయోగిస్తున్నారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో జరిగిన సిఎం పర్యటనలో ప్రింట్ మీడియాకు ఒకే ఒక పాస్ జారీచేశారు. ఫొటోగ్రాఫర్‌కుగానీ, స్థానిక విలేకరులకుగానీ పాస్‌లు ఇవ్వని పరిస్థితి నెలకొంది. పాస్‌లు తీసుకెళ్లిన మీడియా ప్రతినిధులను కూడా సిఎం పర్యటన వార్త కవరేజీ చేయకుండా ఒకచోట కూర్చోబెట్టారు. అడుగడుగునా పోలీసులు నిర్బంధం కొనసాగింది. సమీక్షా సమావేశం వివరాలు కూడా మీడియాకు చెప్పలేదు. ఎందుకు వచ్చారో.. ఎందుకు వెళ్లారో.. మీడియా ప్రతినిధులకే తెలియని పరిస్థితి నెలకొంది. సమాచారశాఖ ఇచ్చిన వార్తనే రాసుకోవాలనే నిర్బంధం పెరిగిపోయిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని చెప్పొచ్చు. మీడియాపై నిర్బంధం రోజురోజుకు పెరుగుతున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిఎం పర్యటనలో జిల్లా అధికారులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది.



అధికారులతో సమీక్షిస్తున్న సిఎం జగన్



మహిళను ఈడ్చికెళ్తున్న పోలీసు సిబ్బంది

పేదలపై విరిగిన లాఠీ

చించినాడలో పోలీసుల జులుం
మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారని
పెరుగులంక పేదలపై అమానుషం
ఎంఎల్ఎ నిమ్మల, సిపిఎం, టిడిపి నాయకులను నడిరోడ్డుపై ఈడ్చేశారు
అడ్డు వచ్చిన వారిపై లాఠీలతో పోలీసులు వీరంగం
పలువురికి తీవ్ర గాయాలు
ఎంఎల్ఎతో సహా సుమారు 50 మంది అరెస్ట్
రణరంగంగా మారిన చించినాడ గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు



పేదలను బలవంతంగా లాక్కెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి - యలమంచిలి/భీమవరం

మండలంలోని చించినాడ గ్రామం రణరంగంగా మారింది. ఈ పంచాయతీ పరిధిలోని పెరుగులంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లిన పేదలపై, నేతలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. టిడిపి, సిపిఎం నేతలతో పాటు మహిళలను కూడా పోలీసులు రోడ్డుపై ఈడ్చుకుంటూ లాక్కెళ్లి అరెస్టు చేశారు. అడ్డొచ్చిన దళితులపై, పేదలపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుతో పాటు సిపిఎం, ఐద్వా ముఖ్యనేతలు, మరో 50 మంది సిపిఎం, టిడిపి నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ ఘటనలో సిపిఎం నాయకులు తెన్నేటి స్టాలిన్, శ్రీనివాస్ తలకు బలమైన గాయాలు కాగా మరికొంత మంది మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. అనేక ఏళ్లుగా పేదల ఆధీనంలో ఉన్న పెరుగులంకలో మట్టి తవ్వకాలను అడ్డుకున్నందుకు పేదలు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నారు. ఈ పోరాటానికి ఎంఎల్ఉ నిమ్మల రామానాయుడు మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం రాత్రి సిపిఎం, టిడిపి నాయకులతో కలిసి పెరుగులంకలోనే బస చేసిన ఎంఎల్ఎ మంగళవారం ఉదయం లంకలోనే కాలకృత్యాలు తీర్చుకొని బయటకు వెళ్లి మళ్లీ కారులో లంకలోకి తిరిగి వస్తున్న సమయంలో హైవే నుండి లంకకు వెళ్లే రోడ్డుకు తిరుగుతున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పేదల భూముల్లో మట్టి అక్రమ తరలింపునకు పోలీసులు అడ్డుకోకుండా, రెవెన్యూ యంత్రాంగం ఉండాల్సిన చోట అసలు పోలీసులకు సంబంధం ఏముందని, మట్టిని అమ్ముకునే దొంగలకు పోలీసులు కాపలా కాయడం ఏమిటని ఎంఎల్ఎ పోలీసులను ప్రశ్నించడంతో సుమారు గంటపాటు పోలీసులకు ఎంఎల్ఎ మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అప్పటికే ఎంఎల్ఎ కారును సుమారు 200 మంది పోలీసులు చుట్టుముట్టి నరసాపురం డిఎస్‌పి, పాలకొల్లు సీఐ ఆధ్వర్యంలో ఎంఎల్ఎను కారు నుండి పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి పోలీసు జీపు ఎక్కించుకుని తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న వందలాదిమంది పేదలు, సిపిఎం, టిడిపి, మహిళా సంఘం నాయకులు రోడ్డుకు అడ్డంగాపడుకుని పోలీసు జీపులను అడ్డగించే ప్రయత్నం చేశారు. దీంతో వారిపై పోలీసులు లాఠీలను ఝుళిపిస్తూ ఆగ్రహంతో ఊగిపోయారు. దొరికిన వారిని దొరికినట్లు మహిళలను సైతం రోడ్డుపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యాను, బస్సులలో ఎక్కించి అరెస్టు చేశారు. ఈ క్రమంలో సుమారు పదిమంది వరకూ మహిళలకు, పురుషులకు తీవ్ర గాయాలైనట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని ఎక్కడికి తీసుకెళ్లారో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో అరెస్ట్ అయిన వారి బంధువులు, మిత్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ప్రభుత్వాసుపత్రులకు తరలించారు.

దళితులకు, పేదలకు అండగా సిపిఎం, ప్రజా సంఘాలు

పెరుగులంక భూముల్లో తవ్వకాలు నిలుపుదల చేసి భూములకు రక్షణ కల్పించాలని సిపిఎం తోపాటు వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ దళితులు, పేదలకు అండగా నిలిచాయి. వారు చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటించాయి. ఇటీవల జిల్లా కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో పేదలు, దళితులతో ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గతనెల 20న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.బలరాం చించినాడ పెరుగులంకభూముల్లో పర్యటించి బాధితుల పక్షాన పోరాడారు.

నిమ్మల అరెస్టుకు టిడిపి నేతల నిరసన

చించినాడలో పేదలు అనుభవిస్తున్న పెరుగులంక భూమిలో అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లిన సిపిఎం, టిడిపి, దళితులు పేదలపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది. రెండు రోజుల నుంచి ఆ ప్రాంతంలోనే ఉండి శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు జులుం ప్రదర్శించారు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, సిపిఎం జిల్లా నాయకులు కౌరు పెద్దిరాజు, బాతిరెడ్డి జార్జి, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణతో పాటు సుమారు 50 మంది సిపిఎం, టిడిపి నాయకులను, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును గణపవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో నిమ్మల అక్రమ అరెస్టు నిరసిస్తూ ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు పోలీస్ స్టేషన్ల వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు.

అక్రమ అరెస్టులను నిరసిస్తూ ధర్నాలు

ప్రజాశక్తి - భీమవరం

చించినాడలో పేదలకు కేటాయించిన లంక భూముల్లో అక్రమ తవ్వకాలు ఆపాలని పోరాడుతున్న ఆందోళనకారులను ప్రభుత్వ నిర్బంధించి అన్యాయంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ విమర్శించారు. మంగళవారం భీమవరం తాలూకా కార్యాలయం సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడారు. నిరసనకు మద్దతు తెలియజేసిన ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులు చేసిన లాఠీఛార్జిలో నలుగురు కార్యకర్తలకు గాయాలయ్యాయని, వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఆ భూముల్లో ఇసుక తవ్వకాలు ఆపాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన బి.వరలక్ష్మి వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, ఎన్.రంగారాజు పాల్గొన్నారు.



గణపవరం పోలీస్ స్టేషన్లో నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

నరసాపురం టౌన్ : చించినాడలో దళితులకు అండగా నిలిచిన ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, సిపిఎం నేతల అరెస్టుపై టిడిపి, సిపిఎం శ్రేణులు భగ్గుమన్నాయి. అందులో భాగంగా నరసాపురం అంబేద్కర్ సెంటర్లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రావణ రాజ్యం రాజ్యమేలుతోందని విమర్శించారు. సిపిఎం నాయకుడు ముచ్చెర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ దళితులకు అండగా నిలిచిన ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును అరెస్టు చేసి ప్రభుత్వం మరో తప్పు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, టిడిపి నేతలు పొన్నాల నాగబాబు, కొల్లు పెద్దిరాజు, తిరుమాని శశీదేవి, పెమ్మాడి శ్రీదేవి, జక్కం శ్రీమన్నారాయణ, ముత్యం, తుమ్మా భాస్కర్, నంద్యాల భాస్కర్, సిపిఎం నేతలు తెలగంశెట్టి సత్యనారాయణ, పొగాకు నారాయణరావు, పొన్నాడ రాము, బూడిద జోగేశ్వరరావు, రామలింగం పాల్గొన్నారు.



భీమవరంలో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

గణపవరం : చించినాడ దళితులకు చెందిన భూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా సిపిఎం నాయుకులు చేస్తున్న పోరాటంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అరెస్టు చేసి గణపవరం పోలీస్ స్టేషన్‌లో ఉంచిన నేపథ్యంలో మండల టిడిపి నాయకులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఉంగుటూరు మాజీ శాసనసభ్యులు గన్ని వీరాంజనేయులు, ఉండి శాసనసభ్యులు రామరాజు, తణుకు మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ గణపవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి రామానాయుడుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం, టిడిపి నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. అనంతరం స్టేషన్ వద్ద బైఠాయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూచంపూడి సురేంద్రకుమార్ రాజు, ఉన్నమట్ల సునీత, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పెరుగులంక దళితుల భూములకు అండగా నిలబడిన సిపిఎం, తెలుగుదేశం నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్లో మంగళవారం సాయంత్రం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికార బలంతో దళితుల సాగు చేసుకునే భూమిలో మట్టి తవ్వకాలను నిలిపివేయాలని, వారికి అండగా పోరాడుతున్న 25 మంది నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లో బంధించడం దారుణమని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎడ్ల చిట్టిబాబు, వీరా పాండురంగారావు, కొత్తపల్లి నాగరాజు, కొత్త విజయకుమార్, చిలకలపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : చించినాడ దళితుల భూముల్లో అక్రమ తవ్వకాలను అడ్డుకున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, సిపిఎం నాయకులు, మహిళల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో ఇటుకలగుంట గ్రామంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు పాలుపూరి సత్యవతి మాట్లాడుతూ చించినాడ పెరుగులంక భూములపై నెలా 15 రోజులుగా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పోరాటాన్ని అణచి వేసే రీతిలో ముందుకు సాగడం దుర్మార్గమన్నారు తక్షణం ఆ భూముల్లో తవ్వకాలు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలుపూరు వెంకాయమ్మ, మాగంటి వెంకటరమణ, గుండుబోయిన సత్యవతి, పి.సత్యవతి, పాల్పురి వెంకట నాగమణి, కొలపల్లి శిరీష పాల్గొన్నారు.

ఆచంట : చించినాడ పెరుగులంక దళితుల భూముల్లో అక్రమ తవ్వకాలు ఆపాలని పోరాడుతున్న సిపిఎం నాయకులకు మద్దతు తెలియజేయడానికి వెళ్లిన ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, దళిత, ప్రజా సంఘాల నాయకులను ప్రభుత్వం, పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని సిపిఎం మండల కమిటీ నాయకులు సిర్రా నర్సింహమూర్తి, పి.మోహనరావు, కుసుమే జయరాజు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆచంట కచేరీ సెంటర్లో ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణం పెరుగులంక భూముల్లో అక్రమ తవ్వకాలను తక్షణం నిలిపివేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వడ్డిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ, సీనియర్ నాయకులు తోటపల్లి సత్యన్నారాయణ, తలుపూరి బుల్లబ్బాయి, మానుకొండ రాంబాబు, చదలవాడ చంటిబాబు పాల్గొన్నారు.

ఆకివీడు : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను, రామానాయుడు అక్రమ అరెస్టును నిరసించాలని టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి స్థానిక జాతీయ రహదారిపై ఎస్ టర్నింగ్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న ఖండించాలన్నారు. ఎంఎల్ఎ రామానాయుడును అరెస్టు చేయడం అక్రమని, ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చర్యలను ప్రతి ఒక్కరూ నిరసించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గొంట్ల గణపతి, నవకోట్ల రామారావు, బొల్లం వెంకట్రావు, గంధం ఉమా సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

లాభసాటి వ్యవసాయం ఘనత వైఎస్‌దే

వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వెంకటరామన్నగూడెంలో వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మంగళవారం రూ.ఐదు కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన సెంట్రల్ గ్రంథాలయ భవన్నాన్ని, మహిళా వసతి గృహాన్ని, తదితర అభివృద్ధి కార్యక్రమాలను ఉపముఖ్య మంత్రి మంత్రి కొట్టు.సత్యనారాయణతో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగచేసే విధంగా ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్ అమలు చేసి సంచలన నిర్ణయం తీసుకున్నారన్నారు. నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరో రెండడుగులు ముందుకేసి రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయడంతో ఇది రైతన్నల ప్రభుత్వమని రుజువైందన్నారు. యంత్ర పరికరాల పంపిణీలో ప్రభుత్వం గ్రూపునకు 40 శాతం సబ్సిడీని, 50 శాతం బ్యాంకు రుణంగా అందజేస్తుందని, 10 శాతం మాత్రమే గ్రూపు సభ్యులు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. ఒక్కో రైతు భరోసా కేంద్రానికి రూ.15 లక్షల విలువైన యంత్ర పరికరాలను అందజేయడం జరుగుతోందని తెలిపారు.

ఖరీఫ్ సీజన్ ముందు ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసిందని తెలిపారు. ప్రతి రైతూ భరోసా కేంద్రం పరిధిలోని వ్యవసాయ సలహా మండలి నిర్దేశించిన అద్దె మేరకు యంత్ర పరికరాలను అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని సులభం చేసుకోవాలని మంత్రి కాకాని గోవర్దన్ రెడ్డి సూచిం చారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయానికి దేశంలోనే మన రాష్ట్రం వెన్నెముక అన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మన రైతులకు బాగా తెలుసునని తెలిపారు. యూనివర్సిటీలో ఎక్కువ పరిశోధనలు చేసి రైతులకు ఎక్కువ లాభాలు కలిగేలా చూడటమే శాస్త్రవేత్తల ప్రథమ కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్, చింతలపూడి శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలిజా, శాసన మండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్, సబ్ కలెక్టరు ఎం.సూర్య తేజ పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వంపై దండయాత్రకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - అత్తిలి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వర్యం చేయాలని ప్రయత్నిస్తున్న మోడీ ప్రభుత్వంపై దండయాత్రకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. స్కిన్నెరపురంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతాన్ని సందర్శించి కొద్దిసేపు కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు బోదెల్లో పనిచేస్తున్నామని, మందుబాబులు సీసాలను పగల కొట్టి పంట బోదెల్లో వేయడంతో కాళ్లు చేతులు తెగి గాయాల పాలవుతున్నామని కూలీలు వాపోయారు. ప్రాథమిక చికిత్సకు అవసరమైన మెడికల్ క్విట్లు ప్రభుత్వం ఇవ్వడం లేదని, రెండు పూటలా ఫొటో, హాజరు చాలా ఇబ్బందిగా ఉందని కూలీలు వీరభద్రరావు వద్ద చెప్పి వాపోయారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ గతంలో 20 మంది కూలీలు ఒక గ్రూపుగా ఉంటే ప్రస్తుతం. దాదాపు 60 మంది వరకూ గ్రూపుగా ఏర్పాటు చేసి గ్రూపు లీడర్‌గా ఒక సైట్ సూపర్ వైజర్‌ను నియమించి ప్రభుత్వం బాధ్యత అప్పగించిందని తెలిపారు. ఉపాధి హామీలు ప్రభుత్వానికి కూలీలకు మధ్య వారధిగా పనిచేస్తూ 60 మంది కూలీల చేత పని చేయించేందుకు సైట్ సూపర్ వైజర్‌కు దాదాపు రూ.15 వేల నుండి రూ.20,000 వేల విలువగల స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. దీంతో అనేక మంది అప్పులు చేసి మరి స్మార్ట్ ఫోన్ కొనుగోలు చేస్తూ ఆర్థికంగా పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సైట్ సూపర్‌వైజర్‌కు పారితోషకం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాయం ప్రశాంతి, పత్తుల వినోద్, దాయం వాణి, లంకపల్లి సత్యానందం, బూడితి రాజకుమారి, సాక రాజారావు, దాయం మమత పాల్గొన్నారు.

నేతల అక్రమ అరెస్టులు దారుణం

సిపిఎం, టిడిపి, ప్రజాసంఘాల నేతల ఖండన

ప్రజాశక్తి - భీమవరం

చించినాడ గోదావరి పెరుగులంక భూముల్లో అక్రమ తవ్వకాలు ఆపాలని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న దళితులు, పేదలపై లాఠీఛార్జి, అక్రమ అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో గోదావరి పెరుగులంక భూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలు ఆపాలని కొన్నాళ్లుగా పేదలు న్యాయబద్ధంగా పోరాడుతున్నారని తెలిపారు. ఈ భూముల్లో తవ్వకాలు చేపట్టకుండా హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లా, పోలీసు యంత్రాంగం వాటిని ఖాతరు చేయడం లేదని తెలిపారు. ఒకవైపు పేదల ప్రభుత్వమని చెప్పుకుంటూ పేదలు, దళితులు, వెనుకబడిన తరగతులకు అన్యాయం చేసేలా ప్రభుత్వం ఇసుక దందాకు పాల్పడుతోందని విమర్శించారు. కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించి పేదలపై, మహిళలపై దౌర్జన్యానికి, అరెస్టులకు పూనుకోవడం దారుణమని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి భయోత్పాతాన్ని కల్గించడం, బెదిరించడం దారుణమని పేర్కొన్నారు. పర్యావరణానికి హానికల్గించే పెరుగులంక ఇసుక అక్రమ తవ్వకం, పేదలపై దౌర్జన్యం ఆపాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెత్తందారులు, బడాబాబులు, భూస్వాములు అక్రమంగా అనుభవిస్తున్న లంకభూములు ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి కనబడడం లేదా అని ప్రశ్నించారు. వాటి జోలికి పోకుండా పేదలు అనుభవిస్తున్న భూములను నాశనం చేయాలనుకోవడం అన్యాయమని, పర్యావరణానికి సైతం విఘాతమని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని, గ్రీన్ ట్రిబ్యునల్ సుమోటోగా జోక్యం చేసుకోవాలని, నిబంధనలను, పర్యావరణాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లంకభూములను పరిరక్షించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. పేదల ఉద్యమాన్ని అన్ని రాజకీయ పక్షాలూ, సంస్థలూ, సంఘాలూ, ప్రజలూ బలపర్చాలని కోరారు.

పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల అక్రమ అరెస్టు దారుణం

చించినాడ పేదలకు అండగా నిలబడిన పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, టిడిపి నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం ఖండించారు. పేదలకు అండగా ఉన్న ఎంఎల్ఎను అరెస్టు చేయడం అక్రమమని, రాష్ట్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక, నిరంకుశ వైఖరిని తెలియజేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఇలాంటి అక్రమ చర్యలు మానుకోవాలని తెలిపారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చించినాడలో వైసిపి కక్షపూరితంగా చేసిన అక్రమ అరెస్టులను ప్రతి ఒక్కరూ ఖండించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చించినాడలో పెరుగులంక భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలకు నిరసనగా జరుగుతున్న ఆందోళనకు మద్దతుగా పాల్గొన్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి గణపవరం తాడేపల్లిగూడెం స్టేషన్లకు తరలించడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అధికారుల దౌర్జన్యాన్ని అడ్డుకున్న దళితులపై పోలీసులు లాఠీఛార్జి చేసి, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుతో సహా 50 మందికిపైగా దళితులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతిబాబు ఖండించారు. ఈ మేరకు మంగళవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. చించినాడలో దళితులకు చెందిన లంకభూముల్లో అధికారులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో దళితుల భూముల లక్ష్యాని దళితులను అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. విచక్షణ రహితంగా మహిళలపై, పేదలపై లాఠీఛార్జి చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై మానవ హక్కుల సంఘం, రాష్ట్ర ఎస్‌సి కమిషన్ తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారందరినీ తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నిమ్మల అరెస్టు దారుణం : సీతారామలక్ష్మి

భీమవరం : చించినాడ గ్రామంలో దళితుల భూముల్లో అక్రమ మట్టి మాఫియాను అడ్డుకున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును పోలీసులు అక్రమ అరెస్టు చేయడాన్ని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఖండించారు. దళిత ఓట్లతో గద్దెనెక్కిన జగన్ దళితుల ఉన్నటువంటి భూములను కబ్జా చేస్తూ దళిత సంక్షేమ పథకాలను రద్దు చేసి దళితులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. దళితులకు రక్షణగా బాధితులతో కమ్యూనిస్టు పార్టీలతో కలిసి ధర్నా చేస్తున్న నిమ్మల రామానాయుడును పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులు త్వరలో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపనున్నారని తెలిపారు.

పాలకొల్లు : చించినాడలో భూముల విషయంలో పోలీసులు సిపిఎం, టిడిపి నేతలపై పట్టణ సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వలవల శ్రీరామ్మూర్తి, చల్లా సోమేశ్వరరావు పోలీసుల దమనకాండను తీవ్రంగా ఖండించారు. ఎక్కడైనా దళితులకు భూములు ఇస్తారని అయితే చించినాడలో దళితులు 70 సంవత్సరాల నుంచి అనుభవిస్తున్న భూముని వైసిపి నేతలు దౌర్జన్యంగా లాక్కొంటే పోలీసులు మద్దతు ఏంటని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుతో పాటు సిపిఎం నేతలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

తణుకు: యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో దళితులు బలహీన వర్గాల భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలను వ్యతిరేకిస్తూ పేదలకు అండగా నిలిచిన పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అరెస్టును తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తీవ్రంగా ఖండించారు. రామానాయుడును అరెస్టు చేసి గణపవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పేదలు ఆధీనంలో ఉన్న పెరుగు లంక భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయకుండా వారి పక్షాన పోరాడుతున్న వాళ్లను అరెస్ట్ చేయడం అన్యాయమని అన్నారు.

తణుకురూరల్ : చించినాడ దళితుల భూముల్లో జరుగుతున్న మట్టి తవ్వకాలను అడ్డుకున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ పోలీసుల బందోబస్తు మధ్య తవ్వకాలు కొనసాగిస్తూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి, అధికారులకు పేదల, దళితుల ఘోష వినపడకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదల భూముల్లో మట్టి తవ్వకాలను నిలుపుదల చేసి, అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను తక్షణం విడుదల చేయాలని వీరభద్రరావు డిమాండ్ చేశారు.

చించినాడ పెరుగులంక పేద, దళిత భూముల్లో అక్రమ మట్టితవ్వకాలు ఆపాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వెంకటేశ్వర సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పెద్దలు పేదల భూములు లాక్కోవడానికి అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం చించినాడ పెరుగులంక భూములకు రక్షణ కల్పించి, మట్టి తవ్వకాలను ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉద్యమం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, ఎ.అజయ కుమారి, కామన మునిస్వామి, సింగులూరి సత్యనారాయణ, బి.శ్రీహరి, కడలి వీర్రాజు, లంక ధనరాజు, ఆర్.విశ్వనాథం, కృష్ణ వేణి పాల్గొన్నారు.

పెనుమంట్ర : చించినాడలో పెరుగులంక భూముల్లో అక్రమంగా మట్టి తరలించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోపాలన్ ఖండించారు. వారికి అండగా ఉన్న టిడిపి పాలకొల్లు శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొవ్వరు పెద్దిరాజు, మండల కార్యదర్శి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కం జిల్లా సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల హరేరామ్, సుబ్బరాజు, లక్ష్మీ కుమారి, కోడే ప్రసాద్, షాక్ పరుపు పాల్గొన్నారు.

పాలకొల్లు : చించినాడ వద్ద దళితులపై పోలీసుల దౌర్జన్య ఘటన ,అరెస్టులను ఐద్వా నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఐద్వా నేతలు బాసిన శ్యామల, దొండపాటి రోజామణి, అరటికట్ల నారాయణమ్మ, దొర రత్నంలు ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలు అనే తేడా లేకుండా మహిళలపై దారుణంగా పోలీసులు ప్రవర్తించిన తీరును వారు ఖండించారు.



తాడేపల్లిగూడెం : ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, నేతలు

బాధితులకు ఎంఎల్ఎ, సిపిఎం నేతల పరామర్శ

తాడేపల్లిగూడెం : చించినాడ గ్రామంలో దళితుల భూముల్లో మట్టి తవ్వకాలను అడ్డుకున్న దళిత, ప్రజాసంఘాల నేతలపై పోలీసు లాఠీఛార్జి చేయడంతో గాయపడిన వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి కరి నాగేశ్వరరావు వేర్వేరుగా మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ పోలీసులు చేతుల మీద మోకాళ్ల మీద స్త్రీలను, పురుషులను లాఠీలతో చేయడం దారుణమన్నారు. కొంతమంది మహిళలను వివిధ పోలీస్ స్టేషన్లు తిప్పి అరెస్ట్ చేసి నిర్బంధించారన్నారు. గాయపడిన వర్లలు శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయకుమార్, తెన్నేటి స్టాలిన్, తానేటి బాలరాజును ఆయన పరామర్శించారు. సుమారు 40 మందిని తాడేపల్లిగూడెం రూరల్ పోలీసు స్టేషన్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్బంధంలో ఉంచారని వారిలో 8 మంది మహిళలు ఉన్నామని ఐద్వా నాయకురాలు పుగాకు పూర్ణ తెలిపారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు.



చెరువులను పరిశీలిస్తున్న తనిఖీ బృందం సభ్యులు

అమృత్ సరోవర్ ద్వారా చెరువులు అభివృద్ధి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి గ్రామంలో అమృత్ సరోవర్ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేసుకోవచ్చని భీమవరం ఇరిగేషన్ డిఇ టి.సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అన్నారు. మంగళవారం జుత్తిగ, మాముడూరు, భట్లమగుటూరు, పెనుమంట్ర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక తీసిన చెరువులను జిల్లా కలెక్టరు నియమించిన బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామంలోని చెరువుల చుట్టూ ప్లాంటేషన్ ఏర్పాటుతోపాటు, సుందరీకరణంగా తీర్చుకోడానికి ఉపాధి హామీ నిధులతోపాటు, దాతల సహకారం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వీటికి కావాల్సిన నిధులు, సౌకర్యాలను వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డిఆర్‌బివై బాబ్జి, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక, కార్యదర్శి వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ బాపూజీ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



ఏలూరుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నాయకులు

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - కాళ్ల

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ బహుజన సమైక్య వ్యవస్థాపక అధ్యక్షులు సోడదాసి గంగయ్య అన్నారు. భీమరంలో అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ఏలూరుపాడు నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా మంగళవారం బయలుదేరి వెళ్లారు. తొలుత ఏలూరుపాడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య ఆధ్వర్యంలో 21 గ్రామాల్లో అంబేద్కర్ అభిమానులు, నాయకులు పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోనా రంజిత్, జి.అశోక్‌కుమార్, గాతల సందీప్, సోడదాసి యాకోబు, దావులూరి సామ్యూల్ రాజు, కన్నయ్య, రాజేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నవ్య జీవన ఆధ్వర్యంలో అతిసార నియంత్రణ పక్షోత్సవాల ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లోపు పిల్లల్లో వచ్చే వాంతులు, విరోచనాలను అరికట్టేందుకు ప్రతి సచివాలయం అంగన్‌వాడీ కేంద్రాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బిడ్డకు తల్లిపాలివ్వడం సమయంలో జాగ్రత్త పాటించాలన్నారు. పాల సీసాలతో పాలు పట్టించేవారు పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవానీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారులు కె.ప్రభాకర్, పిహెచ్ఎన్ వి.ఎలిజబెత్, సబ్ యూనిట్ అధికారి ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎబిఎన్‌వికెలో గుండె వైద్య సేవలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఔషధాలతో పాటు సమతుల్య పోషకాహారం, అవసరమైన మేరకు శరీరక శ్రమతో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.చంద్రశేఖర్ వర్మ రోగులను కోరారు. మంగళవారం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళవారం రోగులను పరీక్షించి వారికి గుండె వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఇసిజి, 2డి ఎకో పరీక్షలను నిర్వహించారు. లక్ష్మీ గాయత్రి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (హైదరాబాద్), వసుధ ఫౌండేషన్ సహకారంతో ఎబిఎన్‌వికెలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. ప్రతిరోజు సాయంత్రం సాధారణ వ్యాధులకు, స్త్రీ సంబంధిత వ్యాధులకు ప్రముఖ వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేద్కర్ సెంటర్‌లో కోలాహలం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణలో భాగంగా మంగళవారం భీమవరం అంబేద్కర్ సెంటర్ అభిమానులతో కోలాహలంగా మారింది. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఉత్సవం మాదిరిగా జరపాలని జిల్లా యంత్రాంగం, అంబేద్కర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేరళ డప్పులు సౌండ్‌తో, మరోపక్క ఉత్తరాంధ్ర నుంచి వచ్చిన కళాకారుల పాటలతో ఈ ప్రాంతం సందడిగా మారింది. దీంతో యువత అంబేద్కర్ జండాలతో చిందులు వేస్తూ ఉత్సాహంగా విగ్రహావిష్కరణకు కార్యక్రమానికి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మొగల్తూరు ఎంపిడిఒగా బాబ్జిరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు ఎంపిడిఒగా ఉండ్రు బాబ్జిరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపిడిఒగా పని చేస్తున్న డాక్టర్ ఆర్‌సి.ఆనంద్‌కుమార్, డిఎల్‌డిఒగా ఉద్యోగన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కోనసీమ జిల్లా మల్లికిపురంలో ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్న బాబ్జిరాజు ఉద్యోగోన్నతిపై మొగల్తూరు ఎంపిడిఒగా వచ్చారు.

పోడూరులో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్న భూసర్వే మంగళవారం జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు మాట్లాడుతూ జగనన్న భూ రీ సర్వే ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సరిహద్దుల సమస్యల పరిష్కారం కావడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థలోనే ఎప్పుడూ లేని విధంగా కొత్త ఒరవడిని సృష్టించి ప్రతిరైతు సమస్యను తీర్చడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తానేటి బాబూరావు, సొసైటీ అధ్యక్షులు కొర్రపాటి వీరాస్వామి, ఉప సర్పంచి పితాని చిన్న పాల్గొన్నారు.

అగ్ని గుండమే..

ఎండ తీవ్రతకు జనం విలవిల

ప్రజాశక్తి - పాలకొల్లు

ఒక పక్క రోహిణీ కార్తె ముగింపు దశకు వచ్చినా పాలకొల్లులో మాత్రం ఎండతీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో మధ్యాహ్నం నుంచి ఎండ అగ్ని గుండం వలే ఉంటోంది. ప్రజలు మధ్యాహ్నం నుంచి రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. దీంతో రోడ్లు కర్ఫ్యూ వాతావరణం వలే నిర్మానుష్యంగా ఉంటున్నాయి. వ్యాపారులు సైతం బేరాలు లేక షాపులు కట్టి తిరిగి సాయంత్రం తెరుస్తున్నారు.

రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

పీడిత ప్రజల అభ్యున్నతి, సామాజిక అసమానతలులేని సమసమాజం కోసం, దోపిడీ వ్యవస్థ అంతానికి తుదిశ్వాస వీడిచే వరకూ పోరాడిన యోధుడు చండ్ర రాజేశ్వరరావు అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం భీమవరంలోని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో చండ్ర రాజేశ్వరరావు 109వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చండ్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సంపన్న కుటుంబంలో పుట్టి బెనారస్ యూనివర్సిటీలో వైద్య విద్యనభ్యసిస్తూ సమసమాజ నిర్మాణం కోసం సామాజిక న్యాయం కోసం తన వైద్య విద్యను సైతం విడనాడి కమ్యూనిస్టు ఉద్యమాల్లో భాగం పంచుకుని పోరాటం చేశారన్నారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 28 ఏళ్లు అంకితబావంతో పనిచేసి పార్టీని అగ్రభాగాన నిలిపారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన చేసిన భూ పోరాటాల ఫలితంగానే భూసంస్కరణల చట్టాలొచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, వైవి.ఆనంద్ పాల్గొన్నారు.

సంచార జాతుల సంక్షేమానికి ప్రత్యేక డ్రైవ్ : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

సంచార జాతులు, యానాదుల సంక్షేమం కోసం ఈ ఏడాది ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో సంచార జాతుల స్థితిగతులపై రాష్ట్ర సంచారజాతుల ఛైర్మన్ పెండ్ర వీరన్న, ఇతర అధికారులతో సమావేశమై కలెక్టర్ సమీక్షించారు. సంచార జాతులు, యానాదుల సంక్షేమానికి ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి, వారికి విద్య, వైద్యం, వసతి సౌకర్యాలకు కృషి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 36 ప్రాంతాల్లో వివిధ కులాల సంచార జాతులు, యానాది కులస్తులున్నారని తెలిపారు. వీరి పిల్లల విద్యకు దూరమై బడి బయట ఉండటం, లేదా ఏదో ఒక పనిలో ఉండటం జరుగుతుందన్నారు. ఇలాంటి పరిస్థితి నుండి సంచార జాతుల కుటుంబాలను జాగృతం చేసేందుకు విద్య, వైద్యం, రెవెన్యూ, పోలీస్, కార్మిక శాఖ అధికారులతో బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతినెల క్రమం తప్పకుండా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తామన్నారు. గర్భిణులు, పెద్దలు, పిల్లలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇస్తామన్నారు. తాడేపల్లిగూడెం డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్న యానాదులను ఇప్పటికే గుర్తించి వారి జీవనశైలిలో మార్పు తీసుకొచ్చేందుకు పలు చర్యలు చేపట్టామని చెప్పారు. వీరి కోసం ప్రత్యేక మెడికల్, ఆధార్ నమోదుకు క్యాంప్‌లను నిర్వహించి వైద్య పరీక్షలు చేయడంతో పాటు, ఆధార్, రేషన్ కార్డుల జారీకి చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ప్రధానంగా నరసాపురం మండలం సీతారామపురంలో యానాదులు, పాలకొల్లు మండలం లంకలకోడేరులో యానాదుల కులస్తులు, పాలకొల్లు పట్టణంలో బుడబుక్కలు, వీరవాసరంలో గంగిరెద్దులు, యానాదులు, రాయకుదురులో మందుల, మండపాకలో బుడబుక్కల, తణుకు పట్టణం ఫ్లైఓవర్ పక్కన రాజన్న రాజన్నలు, అత్తిలి గ్రామంలో గంగిరెద్దులు, యానాదులు, మందుల, తాడేపల్లిగూడెంలో దొమ్మర, ఫ్లైఓవర్ సమీపంలో యానాదులు, పెంటపాడు మండలం పత్తిపాడులో మందుల, ఆకివీడులో చెంచుల కులస్తులున్నారని తెలిపారు. బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. తనిఖీల్లో ఎవరైనా బాలురు దొరికితే తప్పనిసరిగా వసతి గృహాల్లోనే చేర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఒ ఆర్.వెంకటరమణ, ఎస్ఎస్ఎ పిఒ శ్యామ్‌సుందర్, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరావు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు కృషి : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం ఉండి భవానీపేటలో మండల పరిషత్ నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి పివిఎల్ నరసింహరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే గ్రామంలోని పెడాయికోడు మురుగు కాలువ ప్రక్షాళనకు గ్రామ పంచాయతీ పాలకవర్గం పనిచేస్తుందన్నారు. గ్రామంలో అవసరమైన చోట డ్రెయినేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఉండి ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, నాయకులు రణస్తుల మహంకాళి, ఏడిద వెంకటేశ్వరరావు, బులుసు రామకృష్ణ పాల్గొన్నారు.

స్లూయిజ్‌లకు మరమ్మతులు చేయండి

ఎంఎల్ఎ శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నియోజకవర్గ పరిధిలోని స్లూయిజ్‌లను పరిశీలించి వాటికి అవసరమైతే మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా పెద్దగరువు వద్ద ఉన్న స్లూయిజ్‌ను, శృంగవృక్షం వద్ద ఉన్న స్లూయిజ్‌లకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఇ కె.శ్రీనివాస్, ఎఇ వినయ్ కుమార్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు

ప్రపంచానికి ఆదర్శం అంబేద్కర్

శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంబేద్కర్ వాదాన్ని మనదేశమే కాకుండా కాదని ప్రపంచం అనుసరిస్తుందని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం భీమవరంలోని అంబేద్కర్ చౌక్‌లో భీమవరం మండల ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పది అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని స్థానిక శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షత వహించారు. అనంతరం మోషేన్‌రాజు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో నేటి సమాజంలో అన్ని తరగతులకు సమాన హక్కులు సాధ్యమయ్యాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోనే సమాజం అభివృద్ధిని గ్రహించి ఆయన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని అంబేద్కర్ ఉన్నత చదువులు చదివి సమాజంలో అంటరానితనంతో పాటు, మహిళలకు సవమాన క్కులు కల్పించాలని రాజ్యాంగంలో వారికి పెద్దపీట వేశారన్నారు. నేడు ఎంతోమంది ఆయన స్ఫూర్తితోనే ఉన్నత చదువులు చదువుతున్నారని, అలాగే నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ వెండ్ర వెంకటస్వామి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, అంబేద్కర్‌వాదులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెంటపాడు



కుపాధి కూలీల సమస్యలు వింటున్న రైతు సంఘం నేత పుల్లారావు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి తెలిపారు. వల్లూరుపల్లి గ్రామంలో ఉపాధి పని ప్రాంతంలో కూలీలతో ఆయన మాట్లాడారు. రెండు పూట్లా మస్తర్ విధానాన్ని రద్దు చేయాలని. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు పైబడిన వ్యవసాయ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం బడ్జెట్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తక్కువ కేటాయిస్తుందన్నారు. ఓ పక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, దానికి అనుగుణంగా కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ, ఉపాధి కూలీలు నేకూరి శాంత, ఖండేలి గీత, ఉండ్రజవరపు విజయలక్ష్మి, బాదంపూడి మరియమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన మూడు లక్షల చెక్కును లబ్ధిదారుడు బొర్రా రామచంద్రరావు కుమారుడు వాసుకు మంగళవారం ఎంఎల్ఎ అందజేసి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకంలో లేని వ్యాధులకు సైతం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ముఖ్యమంత్రి ఆదుకుని వైద్యం చేయిస్తున్నారన్నారు. భీమవరం నియోజకవర్గంలోని ప్రజలతో పాటు జిల్లాలోని ప్రజలకు కూడా వైద్యపరంగా మరింత మేలు చేసేందుకు 100 పడకల ఆసుపత్రిని భీమవరంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు.